# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

ఆదివారం 26, ఏప్రిల్ 2026


## ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు డాక్టరేట్ ప్రదానం




నేరడిగొండ, ఏప్రిల్ 25, ప్రభాతవార్త

బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ లీడర్‌షిప్ డాక్టరేట్ అందజేసింది. గిరిజన ఎమ్మెల్యేగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు చేస్తున్న సేవలు, ఎల్లప్పుడూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్న వైనాన్ని గుర్తించి ఈ గౌరవాన్ని కల్పించారు. ఢిల్లీలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో అనిల్ జాదవ్ హాజరై డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎల్లప్పుడూ ప్రజా సేవలో కొనసాగుతూ వారి అభివృద్ధికి కృషి చేయడం ఆనందంగా ఉందన్నారు. ప్రజల్లో కలిసి ఉండటం మొదటి నుంచి అలవాటని, ఆ సేవలే ఈరోజు డాక్టరేట్ పొందేలా చేశాయని ఆనందం వ్యక్తం చేశారు. ఈ పురస్కారం తన బాధ్యతను మరింత పెంచిందని తెలిపారు.

# పారిశ్రామికాభివృద్ధికి గనుల విస్తరణ కీలకం

- ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ హరితతో భేటీ
- గోలేటి ఓసీ, మహావీర్ ఖని ప్రాజెక్టులపై కీలకచర్చ

బెల్లంపల్లి, ఏప్రిల్ 25, ప్రభాతవార్త

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా అభివృద్ధి, పారిశ్రామిక ప్రగతికి సంబంధించిన అంశాలపై ముఖ్యమైన చర్చలు చోటుచేసుకున్నాయి. జిల్లా కలెక్టర్ కె. హరితను సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్సీసీఎల్) డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్) కె. వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం. విజయభాస్కర రెడ్డితో కలిసి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో బొగ్గు ఉత్పత్తి పరిస్థితులు, భవిష్యత్ అవసరాలు, కొత్త గనుల ప్రాముఖ్యత వంటి అంశాలపై కలెక్టర్‌తో విస్తృతంగా చర్చించారు. ప్రస్తుతం బెల్లంపల్లి ఏరియాలో ఖైరిగుర ఉపరితల గని (ఓపెన్‌కాస్ట్) నుంచే బొగ్గు ఉత్పత్తి కొనసాగుతోందని, పెరుగుతున్న డిమాండ్ దృష్ట్యా ఇది సరిపోదని అధికారులు వివరించారు. ఉత్పత్తి స్థిరత్వం, పెరుగుదల కోసం కొత్త గనులను ప్రారంభించడం

మిగతా 2లో..





బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆసుపత్రికి

# పునర్జన్మ

## కార్మికులకు అత్యున్నత వైద్య సేవల లక్ష్యం

బెల్లంపల్లి, ఏప్రిల్ 25, ప్రభాతవార్త

సింగరేణి సంస్థ పరిధిలోని ఆసుపత్రుల్లో విశిష్ట స్థానం కలిగిన బెల్లంపల్లి ఏరియా ఆసుపత్రిని మరింత అభివృద్ధి చేసి పూర్వ వైభవాన్ని తిరిగి తీసుకురావడమే లక్ష్యమని సింగరేణి డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్) కే. వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. కార్మిక కుటుంబాల ఆరోగ్య భద్రతకు అత్యున్నత ప్రాధాన్యతనిస్తూ, ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. శనివారం రోజున రూ. 80 లక్షల వ్యయంతో పూర్తిగా మరమ్మతులు చేసి ఆధునిక సదుపాయాలతో పునర్నిర్మించిన ఆసుపత్రి భవనాన్ని ఆయన ఘనంగా ఆవిష్కరించారు. పునర్నిర్మాణంలో భాగంగా వార్డులు, అవుట్ పేషెంట్ విభాగం, ల్యాబ్ సదుపాయాలు, శుభ్రత ప్రమాణాలు, రోగుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు అధికారులు తెలిపారు. ఆసుపత్రి భవనం ఇప్పుడు ఆధునిక వైద్య సేవలకు అనుగుణంగా మారిందని చెప్పారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, గతంలో బెల్లంపల్లి ఏరియా ఆసుపత్రి కార్మికులకు విశ్వసనీయమైన వైద్య కేంద్రంగా నిలిచిందని గుర్తుచేశారు. అయితే కాలక్రమేణా కొన్ని కారణాల వల్ల సేవలు కొంత తగ్గినప్పటికీ, ఇప్పుడు మళ్లీ పునరుద్ధరించి అత్యుత్తమ సేవలు అందించేందుకు చర్యలు ప్రారంభించామని తెలిపారు. ఈ ఆసుపత్రి

మిగతా 2లో..

# మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

* ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



భైంసా, ప్రభాతవార్త:

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. శనివారం భైంసా మండలంలోని దేగాం గ్రామంలో రూ. 10 లక్షల నిధులతో నిర్మించిన గ్రామ మహిళా సమైక్య భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ 90 శాతం నిధులు, రాష్ట్ర ప్రభుత్వ 10 శాతం వాటాతో ఈ భవనాల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. భైంసా మండలానికి 40కి పైగా భవనాలు మంజూరయ్యాయని, రాష్ట్రంలోనే మొదటిసారిగా దేగాంలో భవన నిర్మాణం పూర్తి చేసి ప్రారంభించడం అభినందనీయమని పేర్కొన్నారు. సర్పంచ్ సుష్మారెడ్డి, అధికారుల పనితీరును ఆయన కొనియాడారు. గ్రామస్తుల వినతులపై స్పందిస్తూ.. సిరాల ప్రాజెక్ట్ ద్వారా ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు మచ్కల్ సమీపంలో పెండింగ్‌లో ఉన్న కాలువ మిగతా 2లో..

# చిన్నారులు, గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

* మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



నస్పూర్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త

చిన్నారులు, గర్భిణుల ఆరోగ్యకరమైన భవిష్యత్తుపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ్ పక్వాడ మిగతా 2లో..

# రత్నాపూర్ కాండ్లీలో మార్నింగ్ వాక్ విత్ సర్పంచ్ ప్రారంభం






రత్నాపూర్ కాండ్లీ 2బీహెచ్‌కే కాలనీలో పర్యటిస్తూ సమస్యలను తెలుసుకుంటున్న సర్పంచ్ గడ్డం హరీష్

నిర్మల్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:

నిర్మల్ రూరల్ మండలం రత్నాపూర్ కాండ్లీ గ్రామంలో మార్నింగ్ వాక్ విత్ సర్పంచ్ అనే వినూత్న కార్యక్రమాన్ని సర్పంచ్ గడ్డం హరీష్ శనివారం ప్రారంభించారు. గ్రామంలోని 2బీహెచ్‌కే కాలనీ వాసులతో కలిసి ఆయన ఉదయం నడుస్తూ, గడపగడపకూ వెళ్లి ప్రజా సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రజలు సమస్యల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, నేరుగా వారి వద్దకే వెళ్లి పరిష్కరించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. ప్రతిరోజూ ఒక వార్డులో పర్యటించి ప్రజల కష్టసుఖాలను తెలుసుకుంటానని హామీ ఇచ్చారు. కాలనీలో నెలకొన్న డ్రైనేజీ, వీధి దీపాలు, తాగునీటి సమస్యలను గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకెళ్లగా, వారం రోజుల్లో వాటిని పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. గ్రామస్థులంతా ఆరోగ్యం కోసం ఉదయాన్నే నడక అలవాటు చేసుకోవాలని, ఈ పర్యటనల ద్వారా గ్రామ పాలనలో పారదర్శకత పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు. సర్పంచ్ స్వయంగా తమ వద్దకు వచ్చి సమస్యలు తెలుసుకోవడం పట్ల కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

## చిన్నారులు, గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

(మొదటిపేజీ తరువాయి)

8వ విడత కార్యక్రమానికి జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. అనితలతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పోషణ్ పక్వాడ 8వ విడత కార్యక్రమం ఈనెల 9 తేదీ నుండి 23వ తేదీ వరకు నిర్వహించడం జరిగిందని తెలిపారు. పిల్లలలో మొదటి 6 సంవత్సరాల కాలంలో మెదడు అభివృద్ధి గరిష్టంగా ఉంటుందని, ఈ విషయం ప్రధాన అంశంగా పరిగణలోకి తీసుకుని ప్రత్యేక దృష్టి సాధించడం జరిగిందని తెలిపారు. చిన్నారుల సమగ్ర అభివృద్ధికి పోషకాహారం అత్యవసరమని, గర్భిణి స్త్రీలు, చిన్నపిల్లలకు సరైన ఆహారం అందించడం ద్వారా ఆరోగ్యకరమైన భవిష్యత్తు నిర్మించవచ్చని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించాలని తెలిపారు. గర్భిణులు, బాలల పోషకాహారం పై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, తొలి వేయి రోజులలో సరైన పోషణ, శిశు అభివృద్ధిపై దృష్టి సారించాలని, అంగన్వాడి కేంద్రాల ద్వారా ఆటల ఆధారిత విద్యను ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. పోషణ పంచాయతీలు, సామాజిక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, పిల్లలలో స్క్రీన్ టైమ్ తగ్గించే దిశగా తల్లిదండ్రులకు మార్గదర్శకాలు అందించాలని తెలిపారు. నలుగురు గర్భిణీ స్త్రీలకు శ్రీమంతం, బాలలకు అక్షరాభ్యాసం, గ్రాడ్యుయేషన్ ధ్రువపత్రాల అందజేత కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా స్థానిక సమాజం, తల్లులు, సంరక్షకులను భాగస్వామ్యం చేస్తూ పోషకాహారం పై విస్తృత ప్రచారం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ఈ నెల 27న ప్రజావాణి రద్దు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సంబంధించిన గృహ నిర్మాణ, రెవెన్యూ శాఖల సమస్యలపై ప్రభుత్వం ఈ నెల 27వ తేదీన హైదరాబాద్‌లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినందున 27వ తేదీన రద్దు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ప్రకటనలో తెలిపారు. ప్రజలు, దరఖాస్తుదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని, మే 4వ తేదీ సోమవారం నుంచి ప్రజావాణి కార్యక్రమం యధావిధిగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

## మృతదేహం దొరికింది.. మిస్టరీ వీడింది

### - ఎనిమిది రోజుల తర్వాత గోదావరిలో శవమై తేలిన మల్లేష్

జన్నారం, ఏప్రిల్ 25, ప్రభాతవార్త



గత ఎనిమిది రోజుల నుంచి పోలీసులకు కంటిమీద కునుకు లేకుండా చేసిన మల్లేష్ ఘటన చివరకు విషాదంతో ముగిసింది. ఎనిమిది రోజుల క్రితం జన్నారం మండలం తిమ్మాపూర్ గోదావరి పరిసరాల్లో అదృశ్యమైన గూడ మల్లేష్ మృతదేహం శనివారం దండేపల్లి మండలం గుడిరేవు గోదావరి ప్రాంతంలో లభ్యమైంది.దండేపల్లి మండలం నాగసముద్రానికి చెందిన గూడ మల్లేష్ ఈ నెల 16న రాత్రి తిమ్మాపూర్‌లో పేకాడుతుండగా పోలీసులు అనుకొని పారిపోయి అదృశ్యమయ్యాడు.అప్పటి నుంచి పోలీసులు, కుటుంబసభ్యులు డాగ్ స్క్వాడ్, డ్రోన్ కెమెరాలతో గాలింపు చేపట్టారు.శనివారం గుడిరేవు వద్ద గోదావరిలో శవమై తేలడంతో కుటుంబసభ్యులు మల్లేష్‌గా గుర్తించారు.సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేశారు. మల్లేష్ మరణంపై వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. దీంతో ఆ గ్రామంలో విషాద ఛాయలు అనుముకున్నాయి.

## ఉపాధి హామీ పనులకు కూలీలు అధిక సంఖ్యలో హాజరుకు చర్యలు తీసుకోవాలి

జైపూర్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త

జాబ్ కార్డు కలిగి ఉన్న కూలీలు ఉపాధి హామీ పనులకు అధిక సంఖ్యలో హాజరు అయ్యేలా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపు రావు అన్నారు. శనివారం మండలంలోని టేకుమట్ల, శెట్టిపల్లి, బెజ్జలా,గ్రామ పంచాయతీలను ఆయన సందర్శించారు. ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఇల్లు మంజూరు అయిన లబ్ధిదారులు ఇల్లు నిర్మాణం చేసుకోకపోతే ఆ యొక్క ఇల్లు రద్దు అవుతావని లబ్ధిదారులకు సూచించారు. ఇల్లు మంజూరు అయిన వారందరూ తక్షణమే ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకి అవగాహన కల్పించారు. మొబైల్ యాప్ ఇన్స్పెక్షన్‌లో భాగంగా శానిటేషన్ పనులు నిర్వహించిన ప్రదేశాలను సందర్శించారు ఉపాధి హామీ పనులకు యాక్టివ్ జాబ్ కార్డ్స్ ఉన్నవారందరూ ఎక్కువ సంఖ్యలో ఉపాధి హామీ పనులకు హాజరయ్యేటట్లు ఉపాధి హామీ కూలీలకు సూచించారు. ఈ కార్యక్రమం లో హౌసింగ్ ఏఈ, కాంక్ష పంచాయతీ కార్యదర్శిలు శ్రావణి ఆర్ ప్రతిభ రాణి, రమాదేవిలు గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## 252 జీ ఓ ప్రకారం అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు జారి

### ● కలెక్టర్ హరిత

ఆసిఫాబాద్,ఏప్రిల్ 25, ప్రభాతవార్త :

జిల్లాలో 252 జి ఓ ప్రకారం అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు అంధ జేస్తామని కలెక్టర్ హరిత అన్నారు. శనివారం సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని సమావేశ మందిరం లో జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటి సమావేశానికి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2026 సవత్సరము నకు గాను కమిటి ఆద్వర్యంలో మొదటి విడతలో 94 నూతన అక్రిడిటేషన్ కార్డులు మంజూరి చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. అక్రిడిటేషన్ కార్డుల జారి నిరంతర ప్రక్రియ అని తెలిపారు. అక్రిడిటేషన్ కార్డు కొరకు ధరఖాస్తు చేసుకున్నవారు 252 జి ఓ లో పేర్కొన్న అవసరమైన ధృవ పత్రాలను సమర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఆర్ఓ ఎస్ సంపత్ కుమార్ , జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ సభ్యులు అబ్దుల్ రహమాన్, రవి నాయక్, తుకారాం, సంతోష్, ప్రకాష్ గౌడ్, చందు, ఆబిద్ అహ్మద్, వినయ్ కుమార్, బి రాజు, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

## పారిశ్రామికాభివృద్ధికి గనుల విస్తరణ కీలకం

(మొదటిపేజీ తరువాయి)

అత్యవసరమని తెలిపారు. ప్రత్యేకంగా గోలేటి ఓపెన్‌కాస్ట్ (ఓసీ) గని ప్రాజెక్ట్ అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్ట్ అమలులోకి వస్తే బెల్లంపల్లి ఏరియాలో బొగ్గు ఉత్పత్తి గణనీయంగా పెరగడమే కాకుండా, స్థానికంగా ఉపాధి అవకాశాలు కూడా విస్తరించే అవకాశముందని వివరించారు. గోలేటి ప్రాజెక్ట్ ప్రారంభం వల్ల ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి పెద్ద ఊతం లభిస్తుందని తెలిపారు. అలాగే బెల్లంపల్లి ఏరియాలో ప్రతిపాదిత గనులు, త్వరలో ప్రారంభం కానున్న ప్రాజెక్టులపై సమగ్ర నివేదికను కలెక్టర్‌కు అందజేశారు. ముఖ్యంగా మహావీర్ ఖని ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్ త్వరితగతిన ప్రారంభం కావడానికి అవసరమైన అనుమతులపై దృష్టి సారించారు. ఈ క్రమంలో సిఎ (పరిహార అటవీకరణ) కింద ఉన్న భూమిని సింగరేణికి కేటాయించాలని కలెక్టర్‌ను కోరారు. భూమి కేటాయింపు త్వరగా జరిగితే ప్రాజెక్ట్ పనులు వేగవంతం అవుతాయని, దీనివల్ల ఉత్పత్తి లక్ష్యాలను సకాలంలో చేరుకోవచ్చని వివరించారు. కలెక్టర్ కె. హరిత సింగరేణి ప్రతిపాదనలను శ్రద్ధగా విన్నారు. జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధి, ఉపాధి అవకాశాల పెంపు దిశగా అవసరమైన సహకారం అందించేందుకు సంబంధిత శాఖలతో సమన్వయం చేస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం. సమావేశం ముగింపులో సింగరేణి అధికారులు కలెక్టర్‌కు గౌరవ సూచకంగా ఒక మొక్కను బహూకరించారు. పర్యావరణ పరిరక్షణకు తమ కట్టుబాటును ఈ సందర్భంగా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి రీజియన్ జీఎం (క్వాలిటీ) వీరభద్రం, ఎస్టేట్ అధికారి సాగర్, బిపిఏ ఓసి మేనేజర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆసుపత్రికి పునర్జన్మ

(మొదటిపేజీ తరువాయి)

మీద ప్రజలు పెట్టుకున్న ఆశలు, విశ్వాసం మాకు బాధ్యతగా భావిస్తున్నాం అని అన్నారు.

### సిబ్బంది, వైద్య సేవల బలోపేతం..

ఆసుపత్రిలో వైద్యులు, నర్సులు, సాంకేతిక సిబ్బంది కొరత లేకుండా నియామకాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ప్రతి రోగికి నాణ్యమైన సేవలు అందేలా ఆధునిక వైద్య పరికరాలు కూడా సమకూరుస్తున్నామని తెలిపారు. వైద్యులు రోగులతో సహనం, మానవతా దృక్పథంతో వ్యవహరించాలని, సేవా భావంతో పనిచేయాలని సూచించారు. సింగరేణి ఆసుపత్రులకు ఇప్పటికే ఉన్న మంచి పేరు మరింత పెంచేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

### కొత్త గనులతో పెరుగనున్న అవసరాలు..

బెల్లంపల్లి ప్రాంతంలో గనుల విస్తరణ జరుగనున్న నేపథ్యంలో, వైద్య సేవల ప్రాముఖ్యత మరింత పెరుగుతుందని చెప్పారు. గోలేటి, మహావీర్ ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులు త్వరలో ప్రారంభం కానున్నాయని, కేకే ఓసీపీ విస్తరణ కూడా కొనసాగుతోందని వెల్లడించారు.

కొత్త గనులతో పాటు కార్మికుల నియామకాలు పెరుగుతాయని, దాంతో ఆసుపత్రిపై భారం కూడా పెరుగుతుందని తెలిపారు. ఈ పరిస్థితులకు ముందుగానే సిద్ధమవుతూ వైద్య సేవల సామర్థ్యాన్ని బలోపేతం చేస్తున్నామని వివరించారు.

### బొగ్గు ఉత్పత్తి - సంస్థ అభివృద్ధికి కీలకం..

సింగరేణి సంస్థ అభివృద్ధి బొగ్గు ఉత్పత్తిపై ఆధారపడి ఉంటుందని వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. గత ఆర్థిక సంవత్సరంలో ఉత్పత్తి లక్ష్యాలను బెల్లంపల్లి, సత్తుపల్లి ప్రాంతాల కార్మికులు మాత్రమే సాధించారని పేర్కొన్నారు. ఆ కార్మికులను అభినందిస్తూ, అదే స్ఫూర్తితో ఇతర ప్రాంతాల ఉద్యోగులు కూడా పని చేయాలని కోరారు. సంస్థ అభివృద్ధి కోసం అధికారులు, కార్మికులు కలిసి బాధ్యతగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి జీఎం విజయ భాస్కర్ రెడ్డి, డివైసీఎంవో పాండురంగ చారి, ఏఐటీయూసీ నాయకులు దాగం మల్లేష్, చిప్ప నర్సయ్య, శ్రీధర్, టిబిజీకేఎస్ కార్యదర్శి అనుముల సత్యనారాయణతో పాటు ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్లు, నర్సులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మొత్తం మీద, బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆసుపత్రి పునర్నిర్మాణం కార్మికులకు నాణ్యమైన వైద్య సేవలు అందించే దిశగా కీలక ముందడుగుగా నిలిచింది. భవిష్యత్తులో ఇది ప్రాంతీయ ప్రజలకు మరింత ఉపయోగపడే వైద్య కేంద్రంగా మారనుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

(మొదటిపేజీ తరువాయి)

పనులకు రూ. 50 లక్షలు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. 28వ ప్యాకేజీ పూర్తయితే నియోజకవర్గం సస్యశామలమవుతుందని తెలిపారు. డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి మాట్లాడుతూ.. భూగర్భ జలాలు పెంచేందుకు ప్రతి ఒక్కరూ ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని సూచించారు. సర్పంచ్ సిరం సుష్మారెడ్డి మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధికి సహకరిస్తున్న ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# దోమల వృద్ధి అరికట్టేందుకు పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలి

● మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల బ్యూరో, ఏప్రిల్ 25, ప్రభాతవార్త



దోమల ద్వారా వ్యాప్తి చెందే మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వంటి వ్యాధులను నిరోధించేందుకు దోమల వృద్ధిని అరికట్టాలని, ఇందు కొరకు ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలోని మందమర్రి మండలం ఊరు మందమర్రిలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన శిబిరానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. అనిత, ప్రోగ్రాం అధికారులు డా. సుధాకర్ నాయక్, డా. ప్రసాద్ లతో కలిసి హాజరై కార్యక్రమ సంబంధిత గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వ్యాధులకు చికిత్స అందుబాటులో ఉన్నప్పటికీ ముందస్తు జాగ్రత్తలు పాటించడం ద్వారా వ్యాధులను పూర్తిగా నిరోధించవచ్చని తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికా కార్యాచరణలో భాగంగా ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని, వర్షాకాలంలో మురుగు కాలువలలో నీరు నిల్వ ఉండకుండా ప్రవహించేలా చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. దోమల అభివృద్ధిని అరికట్టేందుకు బ్లీచింగ్ పిచికారి, ఆయిల్ బాల్స్, స్ప్రే కార్యక్రమాలు చేపట్టాలని, ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా అవగాహన కల్పించాలని, డ్రై డే కార్యక్రమాలలో పాల్గొనేలా ప్రజలను ప్రోత్సహించాలని తెలిపారు. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో వ్యాధులను నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించాలని, గ్రామపంచాయతీ, మున్సిపాలిటీలలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. గ్రామీణ గిరిజన ప్రాంతాలలో ప్రభావిత ప్రాంతాలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించాలని, ఇంటి పరిసరాలలో నీరు నిలువ ఉండే ప్రదేశాలను గుర్తించి వాటిని తొలగించాలని, వీధులన్నీ శుభ్రంగా ఉంచాలని, మురుగు కాలువలలో చెత్తాచెదారం తొలగించాలని తెలిపారు. మలేరియా పరీక్ష కొరకు ఆరోగ్య కార్యకర్తల దగ్గర ఉచిత రక్త పరీక్ష కిట్ల ద్వారా చర్యలు చేపట్టి, ఉచిత మందుల సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు. వేసవిలో ఉష్ణోగ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో ప్రజలు సమయపాలన పాటిస్తూ తగు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని, వడదెబ్బకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అనంతరం కీటక జనిత వ్యాధుల నియంత్రణ కొరకు పని చేసి ఉత్తమ సేవలు అందించిన వైద్యులు, వైద్య సిబ్బందికి జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, సిహెచ్ఓలు కాకిరాల వెంకటేశ్వర్లు, నామ్ దేవ్, అల్లాడి శ్రీనివాస్, వైద్యాధికారులు, వైద్యులు, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సీహెచ్ఓ రాజేశ్వర్

## న్యూలోలంలో ఘనంగా ప్రపంచ మలేరియా దినోత్సవం

దిలావర్‌పూర్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:

దిలావర్‌పూర్ మండలం న్యూలోలం గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ మలేరియా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సీహెచ్ఓ రాజేశ్వర్ మలేరియా వ్యాధి లక్షణాలు, వ్యాప్తి, నివారణ చర్యలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. మలేరియా దోమల ద్వారా వ్యాపించే వ్యాధి అని, చలితో కూడిన జ్వరం, నీరసం, తలనొప్పి వంటి లక్షణాలు ఉంటే వెంటనే పరీక్షలు చేయించుకోవాలని ఆయన సూచించారు. నివారణకు దోమతెరలు వాడాలని, పాత టైర్లు, వాడి పడేసిన వస్తువుల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని కోరారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో దోమల నివారణకు ప్రతిరోజూ శానిటైజేషన్ పనులు చేపడుతున్నామని, వారానికి ఒకసారి ఫాగింగ్ నిర్వహిస్తున్నామని అధికారులు వెల్లడించారు. ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.




## ప్రజల సహకారంతోనే మలేరియా నిర్మూలన

- బెల్లంపల్లి డిప్యూటీ డీఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ సుధాకర్ నాయక్...

తాండూర్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త

ప్రజలు బాధ్యతయుతంగా సహకరించినప్పుడే మలేరియా నిర్మూలించవచ్చని బెల్లంపల్లి డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ సుధాకర్ నాయక్ అన్నారు. తాండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఎం.వి.కె3 ఇంక్లైన్ లో శనివారం ప్రపంచం మలేరియా దినోత్సవం పురస్కరించుకొనిమలేరియా నివారణ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 35 మందికి వైద్య పరీక్షలు చేశారు. బెల్లంపల్లి డిప్యూటీ డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ సుధాకర్ నాయక్ మాట్లాడుతూ ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత శుభ్రత పాటించాలని, నీరు నిల్వ ఉండకుండా, దోమలు వృద్ధి చెందకుండా చూసుకోవాలని సూచించారు. మలేరియా బారిన పడకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో ప్రజలకు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంవికే 3 ఇంక్లైన్ సర్పంచ్ చందనాల రవికుమార్, ఎంపీడీవో శ్రీనివాస్, తాండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఝాన్సీ రాణి, ఎస్.యు.ఓ.శ్రీనివాస్, సి.హెచ్.ఓ.సత్యయ్య, సూపర్ వైజర్లు తారాబాయి, రమాదేవి,పంచాయతీ సెక్రెటరీ కృష్ణ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## బెల్లంపల్లి ఏరియాలో డైరెక్టర్ పర్యటన

- కైరిగూడ ఓసీపీలో డంపర్ రిపేర్ షెడ్డు ప్రారంభించిన డైరెక్టర్

తాండూర్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త :

బెల్లంపల్లి ఏరియాలో సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వర్లు (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్) ఏరియా జిఎం విజయ భాస్కర రెడ్డి తో కలిసి శనివారం పర్యటించారు. కైరిగూడ ఉపరితల గని విస్తరణ పనులను పర్యవేక్షించారు. వ్యూపాయింట్ నుండి ఓసి పని స్థలాలను పరిశీలించారు. కైరిగూడ ఓసి ఆవరణలో నిర్మించిన 60 టన్నుల డంపర్ మరమ్మతుల షెడ్ ను డైరెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వార్షిక సంవత్సరంలో బెల్లంపల్లి, సత్తుపల్లి ఏరియాలు 100 శాతం బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించాయన్నారు. గత ఏడాది మాదిరిగానే 202627 వార్షిక సంవత్సరంలో కూడా 100 శాతం బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో గోలేటి ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి తిరుపతి, ఉపాధ్యక్షుడు బయ్యా మొగిలి, బెల్లంపల్లి రీజియన్ జిఎం క్వాలిటీ వీరభద్రం, సీఎంఓ ఏఐ ఏరియా అధ్యక్షులు, కైరిగూడ ప్రాజెక్ట్ అధికారి మచ్చగిరి నరేందర్, ఏరియా ఇంజినీర్ జి కృష్ణ మూర్తి, ఇంచార్జ్ ఎస్ ఓ టు జి ఎం ఉమాకాంత్, డీజీఎం సివిల్ మదీనా భాషా, ప్రాజెక్ట్ ఇంజినీర్ వీరన్న, మేనేజర్ శంకర్, పర్సనల్ హెచ్ ఓ డి రాజేశ్వర్ రావు, కైరిగూడ ఓసి పిట్ కార్యదర్శి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



కైరిగూడ ఓసీపీలో డంపర్ రిపేర్ షెడ్డు ప్రారంభించిన సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వరరావు



విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి భోజన్న

## ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా దిలావర్‌పూర్ కేజీబీవీ

దిలావర్‌పూర్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:

జిల్లాలోనే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా దిలావర్‌పూర్ కస్తూరిబా బాలికల విద్యాలయం ఎంపిక కావడం గర్వకారణమని జిల్లా విద్యాధికారి భోజన్న తెలిపారు. శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంప్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శిబిరంలో విద్యార్థులకు రెమెడియల్ తరగతులతో పాటు ఐఐటీ జేఈఈ శిక్షణ తరగతులు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్తును బంగారంలా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. క్రమశిక్షణ, పట్టుదల ఉంటే ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో సదానందం, ఎస్ఓ అపర్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యలతో ప్రజల ఇబ్బందులు..

- పట్టించుకోని అధికారులు

దిలావర్‌పూర్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:



దిలావర్‌పూర్ మండల కేంద్రంలో విద్యుత్ సమస్యలు నిత్యకృత్యమయ్యాయి. సరఫరాలో అంతరాయాలను నివారించేందుకు నాలుగు నెలల క్రితం కొత్త నియంత్రిక (ట్రాన్స్‌ఫార్మర్) కోసం గద్దె నిర్మించినా, నేటికీ దాన్ని ఏర్పాటు చేయలేదు. ప్రస్తుతం ఉన్న నియంత్రికపై లోడ్ పెరగడంతో తరచూ విద్యుత్ నిలిచిపోతోందని స్థానికులు తెలిపారు. కొత్త నియంత్రిక ఏర్పాటు చేయాలని కోరుతున్నా అధికారుల నిర్లక్ష్యం వల్ల పనులు ముందుకు సాగడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎండల తీవ్రత పెరుగుతున్న తరుణంలో విద్యుత్ అంతరాయాలు సమస్యగా మారాయని, ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే కొత్త నియంత్రికను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



## ఘనంగా ప్రారంభమైన యేసు పునరుత్థాన జాతర

**లక్షెట్టిపేట, ఏప్రిల్ 25 ప్రభాతవార్త**

లక్షెట్టిపేటలోని చరిత్రాత్మక సీఎస్ఐ చర్చి ఆవరణలో ప్రతి సంవత్సరం ఏప్రిల్ 25, 26 తేదీల్లో నిర్వహించే యేసు పునరుత్థాన మహోత్సవ ప్రాంతీయ జాతరకు ఏర్పాట్లు చేశారు. లక్షెట్టిపేట, దండేపల్లి, జన్నారం, దొనబండ, మాదాపూర్, మందపల్లి, లక్ష్మీపూర్ పాస్టరేటు కమిటీల సహకారంతో నిర్వహించే జాతరను ప్రాంతీయ క్రైస్తవ జాతరగా పిలుస్తుంటారు. జాతరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి వస్తారు. కాగజ్నగర్ నుంచి మోటార్ సైకిళ్లపై బెల్లంపల్లి, రామకృష్ణాపూర్, మందమర్రి, మంచిర్యాల మీదుగా, ఉట్నూర్ నుంచి జన్నారం, దండేపల్లి మీదుగా ర్యాలీగా భక్తులు తరలివస్తారు. మెదక్ అధ్యక్ష మండలం బిషప్ కె. రూబెన్ మార్క్, స్త్రీల మైత్రి అధ్యక్షురాలు ప్రిస్కిల్ల రూబెన్లతో పాటు పలు జిల్లాల నుంచి వచ్చే గురువుల ఆధ్వర్యంలో 25వ తేదీ సాయంత్రం నుంచి జాతర ప్రారంభమైంది.



వేసవి శిబిరలను ప్రారంభిస్తున్న డి డి అంబాజీ

## వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

**- డిడి జాదవ్ అంబాజీ**

**ఉట్నూర్, ఏప్రిల్ 25,ప్రభాతవార్త**

గిరిజన విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీసి వారిని సాన పెట్టేందుకు గిరిజన సంక్షేమ శాఖ ఏర్పాటు చేసిన వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ అన్నారు, శనివారం ఉట్నూర్ కేబి కాంప్లెక్స్ లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు, వేసవి సెలవులలో తమ సమయాన్ని వృధా చేసుకోకుండా క్రీడలు కలలు కంప్యూటర్ కుట్లు అల్లికలు టైలరింగ్ చిత్రలేఖనం లాంటి ఎన్నో అంశాలను నేర్చుకునే అవకాశం విద్యార్థులకు దక్కిందన్నారు, భవిష్యత్తులో ఉపాధికి సైతం ఎన్నో అవకాశాలు లభిస్తాయని చెప్పారు, పిల్లలు ఇంటిని మరిచేలా అనేక కార్యక్రమాలు ఉంటాయని ఆటపాటలతో సేద తీరాలని కోరారు, డిప్యూటీ డిఇఓ గోడం చందనం ఏపీఓ పి వి టి జి ఆత్రం భాస్కర్ లు మాట్లాడుతూ 15 రోజులపాటు జరిగే శిబిరాలలో చివరి వరకు ఉండి అన్ని అంశాల్లో ప్రావీణ్యం సాధించాలన్నారు ఎండలు తీవ్రంగా ఉన్నందున బయట తిరగొద్దని సూచించారు, పాము పాఠశాలలకు వచ్చినప్పుడు శిబిరాల్లో నేర్చుకున్న విషయాలను గురించి అడుగుతామని చెప్పారు, అనంతరం క్రీడా పరికరాలను పంపిణీ చేశారు,

## వడదెబ్బతో ట్రాక్టర్ డ్రైవర్ మృతి



**తాండూర్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త :**

మండలంలోని రేచిని గ్రామ పంచాయతీ పరిధిలోని బారేవాడకు చెందిన కొట్రంగి జయరాం(40) అనే ట్రాక్టర్ డ్రైవర్ శుక్రవారం రాత్రి వనదెబ్బతో మృతి చెందినట్లు తాండూర్ ఎస్సై ప్రసాద్ తెలిపారు. జయరాం పని నిమిత్తం శుక్రవారం బెల్లంపల్లి వెళ్లి మధ్యాహ్నాం ఇంటికి తిరిగి వచ్చాడు. సాయంత్రం వాంతులు, విరేచనాలు కావడంతో కుటుంబ సభ్యులు బెల్లంపల్లి ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల వెళ్ళమని సూచించారు. దీంతో మంచిర్యాలకు తరలిస్తుండగా శుక్రవారం రాత్రి మార్గమధ్యంలో మృతి చెందాడు. వడదెబ్బ తగలడం వలన తన భర్త చనిపోయాడని మృతుని భార్య కొట్రంగి నీలబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

### ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణలో

# మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

**- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**నస్పూర్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త**

ప్రత్యేక సమగ్ర ఓటర్ల జబితా సవరణలో మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాములు, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, ప్రత్యేక ఉప పాలనాధికారి చంద్రకళ లతో కలిసి అన్ని మండలాల తహసిల్దార్లు, ఎన్నికల విభాగం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో మ్యాపింగ్ శాతాన్ని పెంపొందించడం అత్యవసరమని తెలిపారు. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన 2002 ఓటర్ల జాబితాలు https://ceotelangana.nic.in, https://ceotelangana.nic.in, ఓటర్ సర్వీస్ పోర్టల్ https://voters.eci.gov.in, https://voters.eci.gov.in లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జిల్లా, మండల స్థాయి అధికారులు తమ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులు (రెగ్యులర్, ఒప్పంద, పొరుగు సేవలు, దినసరి, ఇతరులు), వారి కుటుంబ సభ్యులు తాము నమోదు చేయబడిన పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన బూత్ స్థాయి



అధికారులను సంప్రదించి 2002 ఓటర్ల జాబితాలో ఎన్నికల మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఫారం 6, 7, 8 ద్వారా అందిన దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి త్వరగా పరిష్కరించాలని, మరణించిన, ఇతర ప్రాంతాలకు మారిన ఓటర్ల వివరాలను గుర్తించి ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి పరిశీలించి వివరాలను ధ్రువీకరించి తొలగించాలని/ సవరించాలని తెలిపారు. ఒకే నియోజకవర్గంలో చిరునామా మార్చుకున్న ఓటర్లకు నోటీసులు జారీ చేసి సరైన చిరునామాలో ఓటు నమోదు చేయాలని, ఇతర నియోజకవర్గాలు మారిన ఓటర్లను ప్రస్తుత జాబితా నుండి తొలగించాలని తెలిపారు. జిల్లాలో డబుల్ ఓటర్లను గుర్తించి తొలగించాలని, ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమంపై ప్రజలలో అవగాహన కల్పించేందుకు దినపత్రికలు, స్థానిక ఛానల్లలో స్క్రోలింగ్ నిర్వహించాలని తెలిపారు. మున్సిపల్, గ్రామీణ ప్రాంతాలలో చెత్త సేకరణకు ఉపయోగించే వాహనాల ద్వారా టామ్ టామ్ ప్రచారం నిర్వహించి ఓటర్లను చైతన్యపరచాలని తెలిపారు. జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో కృషిచేసి విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 27 నుంచి సింగరేణి మహిళా ఉద్యోగులకు క్రీడా పోటీలు

**తాండూర్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త :**

140వ మే డే సందర్భంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సింగరేణి మహిళా ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ కార్యదర్శి తిరుపతి తెలిపారు. ఈనెల 27న గోలేటి సిహెచ్పీ మహిళలకు, 28న ఏరియా వర్క్ షాప్ అండ్ స్టోర్స్, పిఓ ఆఫీస్, విటిసి మహిళలకు, 29న కైరిగూడ ఓపెన్ కాస్ట్ మహిళ ఉద్యోగులకు క్రీడా పోటీ నిర్వహించి, అదే రోజు విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. మహిళా ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

## వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**ఆసిఫాబాద్,ఏప్రిల్ 25, ప్రభాతవార్త :**

ఉమ్మడి జిల్లా గిరిజన క్రీడాకారులు వేసవి శిక్షణ శిభిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ హరిత అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలలో ఉమ్మడి జిల్లా గిరిజన విద్యార్థులకు ఏర్పాటు చేసిన వేసవి క్రీడల శిక్షణ శిభిరాన్ని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి రమాదేవితో కలిసి కలెక్టర్ హరిత ప్రారంబించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా గిరిజన విద్యార్థుల కొరకు వేసవి క్రీడల శిక్షణ లో భాగంగా హ్యాండ్ బాల్, కబడ్డీ, అథ్లెటిక్ పై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు ఈ శిక్షణ శిభిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకోని క్రీడలలో రాణించాలన్నారు. ఈ సందర్భంగా క్రీడ కారులకు క్రీడా దుస్తులు, షులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన క్రీడల అధికారి మడారి శేఖు, జిసిడిఓ శకుంతల, ఎంసిఓ ఉద్ధవ్, పాఠశాల హెచ్ఎం సాయి బాబా, వ్యాయమ ఉపాధ్యాయులు విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.





## నూతన తహసిల్దార్‌గా విజయ కాంతారావు బాధ్యతల స్వీకరణ

**సారంగాపూర్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:**

సారంగాపూర్ మండల తహసిల్దార్‌గా విజయ కాంతారావు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన సంధ్యారాణి బదిలీపై వెళ్లడంతో, నిజామాబాద్‌లో పనిచేస్తున్న విజయ కాంతారావు ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా నూతన తహసిల్దార్‌ను స్థానిక కాంగ్రెస్ నాయకులు, మాజీ మార్కెట్ చైర్మన్ రాజేశ్వర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొల్లెజి నరసయ్య, సర్పంచ్ కోనేరు భూమన్న శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. బాధ్యతలు చేపట్టిన విజయ కాంతారావుకు వారు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ చెక్కును అందజేసిన ఎమ్మెల్యే

**సారంగాపూర్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:**



మండలంలోని అల్లూరు గ్రామానికి చెందిన నర్సవ్వ అనే మహిళ మెదడు శస్త్రచికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆమెకు మెరుగైన వైద్యం అందించేందుకు ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి శనివారం ప్రభుత్వం నుంచి మంజూరైన రెండు లక్షల రూపాయల సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదలకు మెరుగైన వైద్యం అందించడంలో ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు. ఆపద సమయంలో తమకు అండగా నిలిచిన ఎమ్మెల్యేకు లబ్ధిదారు కుటుంబ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్న సర్పంచులు

## పలు గ్రామాల్లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ప్రారంభం

**సారంగాపూర్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:**

మండలంలోని తాండ్ర, కంకేట, వైకుంఠపురం గ్రామాల్లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను శనివారం స్థానిక సర్పంచులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి కృషితో తమ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటయ్యాయని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మద్దతు ధర పొందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో తాండ్ర సర్పంచ్ కొప్పుల వెన్నెల, కంకేట సర్పంచ్ సోయబ్ రావు, వైకుంఠపురం సర్పంచ్ జంగం ఆనంద్, వార్డు సభ్యులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కవ్వాల్‌లో పిచ్చి కుక్క స్వైరవిహారం

**- ఐదు ఆవులు, దూడపై దాడి**

**- గ్రామస్తులు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిక జారీ**

**జన్నారం, ఏప్రిల్ 25, ప్రభాతవార్త**



కవ్వాల్ గ్రామంలో శనివారం ఉదయం నుంచి ఒక పిచ్చి కుక్క స్వైర విహారం చేస్తుంది. ఇప్పటికే ఒక చిన్న ఆవు దూడతో పాటు సుమారు ఐదు ఆవులపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ నేపథ్యంలో గ్రామస్తులంతా అప్రమత్తంగా ఉండాలని గ్రామ పెద్దలు హెచ్చరిక జారీ చేశారు. ముఖ్యంగా చిన్న పిల్లలను ఒంటరిగా బయటకు పంపవద్దని సూచించారు. వీధుల్లో తిరిగేటప్పుడు, పొలం పనులకు వెళ్ళేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలని కోరారు. ఈ విషయాన్ని గ్రామంలోని అందరికీ తెలియజేసి, గ్రామస్తులు, పశువుల రక్షణ కోసం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పిచ్చి కుక్క కనిపిస్తే వెంటనే గ్రామ పంచాయతీ లేదా సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

## ఆరేపల్లిలో బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఆడే గజేందర్

**నేరడిగొండ, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:**

నేరడిగొండ మండలంలోని కొరిటికల్ (కె) మాజీ సర్పంచ్ ఆత్రం నగేష్ మేనమామ, ఆరేపల్లి గ్రామానికి చెందిన గెడం జ్యోతిరామ్ ఇటీవలే రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ శనివారం బాధిత కుటుంబాన్ని సందర్శించారు. జ్యోతిరామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఆయన, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరేపల్లి సర్పంచ్ రవీందర్, లింగాట్ల సర్పంచ్ మల్లేష్ పటేల్, బోథ్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తిత్రే నారాయణ సింగ్, మాజీ ఎంపీపీ సాబ్లె ప్రేమ్ సింగ్, సిడం భూమన్న పటేల్, గోడం బాపూరావ్ పూజారి, ఎండీ సద్దాం, గోడం యదో రావ్, గోడం లక్ష్మణ్, బానోవత్ రవి, పంద్రం శ్రీకాంత్, మాజీ సర్పంచ్ సిడం గంగా ప్రసాద్, నాగేష్, వార్డు సభ్యులు కొట్నాక్ భీంరావు, దుర్వ సోనేరావు, మడవి భూమన్న తదితరులు పాల్గొన్నారు.



# పారిశుద్ధ్య సమస్యలు పరిష్కరించాలి

**- అదనపు కలెక్టర్ చంద్రయ్య**

**దండేపల్లి, ఏప్రిల్ 25, ప్రభాతవార్త**



దండేపల్లి మండలంలోని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) చంద్రయ్య శనివారం దండేపల్లి మండలం, ధర్మారావుపేట గ్రామ పంచాయతీని సందర్శించారు. ఈ పర్యటనలో భాగంగా, వారు. అక్కడ కొనసాగుతున్న పారిశుధ్య పనులు, నర్సరీ, నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లు, సెగ్రిగేషన్ షెడ్ మొదలైన వాటిని తనిఖీ చేశారు. స్థానిక ప్రజలతో మాట్లాడటంతో పాటు, గ్రామంలో పీఎంఆజయ్ పథకం కింద ప్రతిపాదించిన సీసీ డ్రెయిన్లు, సీసీ కల్వర్టులు, తాగునీటి పైప్‌లైన్ల వంటి వివిధ అభివృద్ధి ప్రతిపాదనల కోసం కేటాయించిన ప్రదేశాలను కూడా చంద్రయ్య పరిశీలించారు. అంతకుముందు అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) చంద్రయ్య దండేపల్లి మండలంలోని ముత్యంపేట మరియు చెల్కగూడ గ్రామ పంచాయతీల పరిధిలోని ఉపాధి హామీ కార్యక్షేత్రాలను సందర్శించారు. ఈ పర్యటన సందర్భంగా, ఆయన కార్మికులతో మాట్లాడి, వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు ప్రయత్నించారు. కార్యక్షేత్రాలలో తాగునీటి సరఫరా, షేడ్ నెట్ ఏర్పాటు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు సరఫరా వంటి సౌకర్యాలను కూడా ఆయన పరిశీలించారు. ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతూ, గ్రామంలో పారిశుద్ధం, వడ్ల కొనుగోలు, మంచి నీటి సరఫరా, కొత్త పింఛన్లు, రేషన్ బియ్యం, మురికి కాలువల గురించి మరింత సమాచారం అడిగి తెలుసుకున్నారు. ఇట్టి కార్యక్రమంలో డిపిఓ వెంకటేశ్వర్లు, మండల ప్రత్యేక అధికారి దుర్గా ప్రసాద్, డిఎల్‌పిఓ ధర్మారాణి, ఎంపీడీవో జెఆర్ ప్రసాద్, ఎంపిఓ ప్రసాద్, గ్రామ సర్పంచ్ కుడిమెత తిరుపతి, ఉప సర్పంచ్ ఎండి ఫయాజ్, ఏపిఓ దుర్గా దాస్, గ్రామ కార్యదర్శి హరీష్, టిఏ అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## 26న భట్రాజు సంఘం సర్వసభ్య సమావేశం

**దిలావర్‌పూర్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:**

తెలంగాణ రాష్ట్ర భట్రాజు సంఘం నిర్మల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 26న సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. స్థానిక తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో ఈ కార్యక్రమం జరగనుంది. సమావేశంలో భట్రాజు సంఘం అభివృద్ధికి సంబంధించిన పలు ముఖ్య అంశాలపై చర్చించడంతో పాటు, నూతన జిల్లా కార్యవర్గ ఎన్నికలు కూడా నిర్వహించనున్నట్లు ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని భట్రాజు సంఘ సభ్యులు అందరూ పెద్ద ఎత్తున హాజరై, ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

## బెల్లంపల్లి ఏరియాలో సింగరేణి డైరెక్టర్ పర్యటన

**- వంద ఉత్పత్తి సాధించినందుకు అభినందనలు**

**- వచ్చే ఏడాదికి లక్ష్యాలు అధిగమించాలని పిలుపు**



**బెల్లంపల్లి, ఏప్రిల్ 25, ప్రభాతవార్త**

సింగరేణి సంస్థ వ్యాప్తంగా గత ఆర్థిక సంవత్సరంలో బెల్లంపల్లి, సత్తుపల్లి ఏరియాలు మాత్రమే వంద శాతం ఉత్పత్తి లక్ష్యాలను సాధించాయని సింగరేణి డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్) కె. వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ విజయాన్ని సాధించినందుకు సంబంధిత అధికారులు, సిబ్బందిని ఆయన అభినందించారు. శనివారం రోజున ఆయన బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం. విజయ భాస్కర్ రెడ్డి తో కలిసి బెల్లంపల్లి ఏరియాలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి ఏరియా ఆసుపత్రిలో ఆధునీకరించిన ల్యాబ్, అవుట్ పేషంట్ విభాగాలు, గైనకాలజీ, జనరల్ మరియు ఆర్థో బ్లాక్‌లను ప్రారంభించారు. అనంతరం ఖైరిగుర ఉపరితల గని విస్తరణ పనులను పరిశీలించారు. వ్యూ పాయింట్ నుంచి ఓపెన్ కాస్ట్ (ఓసీ) పనులను సమీక్షించి, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కూడా గత ఏడాది మాదిరిగానే 100 శాతం ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించాలని అధికారులను ఆదేశించారు. తదుపరి ఓసి ఆవరణలో నిర్మించిన 60 టన్నుల డంపర్ మరమ్మత్తుల షెడ్‌ను ప్రారంభించారు. సంస్థ అభివృద్ధి, ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంపొందించేందుకు చేపడుతున్న చర్యలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గోలేటి ఏఐటియూసీ బ్రాంచి కార్యదర్శి ఎస్. తిరుపతి, బెల్లంపల్లి ఏఐటియుసి బ్రాంచి కార్యదర్శి ద్యాగం మల్లేష్, రీజియన్ జీఎం (క్వాలిటీ) వీరభద్రం, సీఎంఓఏ ఏఐ ఏరియా అధ్యక్షులు, ప్రాజెక్ట్ అధికారి మచ్చగిరి నరేందర్, ఏరియా ఇంజినీర్ జి. కృష్ణమూర్తి, ఎస్ఓటు జీఎం ఎన్. ఉమాకాంత్, డివై సీఎంఓ పాండురంగావారి, డీజీఎం (సివిల్) ఎస్‌కే మదీనా భాషా, ప్రాజెక్ట్ ఇంజినీర్ వీరన్న, మేనేజర్ శంకర్, పర్సనల్ హెచ్ఓడీ ఎస్వీ రాజేశ్వర్ రావు, ఏరియా ఆసుపత్రి పిట్ కార్యదర్శి శ్రీధర్, ఖైరిగుర ఓసి పిట్ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**- డైరెక్టర్ కు వినతిపత్రం ఇచ్చిన ఏఐటీయూసీ నాయకులు**

**తాండూర్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త :**

సింగరేణి కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ కార్యదర్శి తిరుపతి, ఉపాధ్యక్షుడు బయ్య మొగిలి కోరారు. బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఓసీలో శనివారం డైరెక్టర్ ను నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏరియాలోని కార్మికుల ప్రధాన సమస్యలను గతంలో అనేకమార్లు స్ట్రక్చర్ కమిటీల ద్వారా అధికారులకు, యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లామన్నారు. జూలై 2025 నుండి ఇప్పటి వరకు జరిగిన మెడికల్ బోర్డులను సమీక్షించి, అప్లై చేసుకున్న వారిని అన్‌ఫిట్ చేసి కార్మికుల పిల్లలకు కారుణ్య నియామకాలు చేపట్టాలన్నారు. కార్మికుల సొంత ఇల్లు పథకం కమిటీలో యూనియన్ ప్రతినిధులను కూడా కమిటీ సభ్యులుగా నియమించి సొంత ఇంటికోసం తక్షణమే నిర్ణయం తీసుకునే విధంగా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మారం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరం

**లక్సెట్టిపేట, ఏప్రిల్ 25, ప్రభాతవార్త**

బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, బాల్య వివాహాల నిరోధక చట్టంపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలని లక్సెట్టిపేట కోర్టు జూనియర్ సివిల్ జడ్జి సాయికిరణ్ సూచించారు. శనివారం లక్సెట్టిపేట మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన పాల్గొన్నారు. బాల్య వివాహాలు చేయడం వల్ల చిన్నారుల భవిష్యత్తు చిన్నాభిన్నం అయ్యే అవకాశం ఉందన్నారు.

